కథానిక

# ప్రజాస్వామికం

కొడవటిగంటి
కుటుంబరావు

అసలీ బెడదంతా తెచ్చిపెట్టింది సోమేశ్వరుడుగారు. ఆయన ఆనాడు వాళ్ళింట్లో మీటింగు పెట్టి కళాసేవాసంఘం పెడదామని నిర్ణయించకపోతే ఏబాధ లేకపోను. కాని అటువంటి నిర్ణయం జరిగింది. ఆ మీటింగుకు ఆహ్వానించబడిన పదిమందిలోనూ నేనున్నాను. గాని, హాజరైన తొమ్మిదిమందిలో లేను. కళ అన్నా, సేవఅన్నా, సంఘమన్నా మనకు పడదు. ఇటువంటి ఆశయాలతో ఏర్పడే సంస్థలు పని చేసి చావవని మనకు తెలుసు. ఒకవేళ పని చేసినా మరోఊళ్ళో చెయ్యాలిసిందేగాని నాకు రోజూ కనిపించే ఈ మొహాలవల్ల ఏమీ కాదని నా దృఢవిశ్వాసం.

ఒకందుకు సోమేశ్వరుడుగారినీ వాళ్ళనీ మెచ్చుకోవలిసిందే. నిజంగానే కళాసేవాసంఘం పెట్టబోతున్నట్టు వాళ్ళు మావూరి జనాన్ని నమ్మించారు. ఊళ్ళో ఈసారి బహిరంగసభ కూడా ఏర్పాటయింది. అయినా చూద్దామని ఈసారి నేనూ వెళ్ళా. యాభై అరవైమంది వచ్చారు.

నాపక్కన కూచున్న పెద్దమనిషి, 'ఎందుకండీ ఈ మీటింగూ?' అన్నాడు.

'ఏదోవిధంగా అనామకులు కొందరు పైకి రావటానికి!' అన్నా బిగ్గరిగా. అందరూ నాకేసి తిరిగి చూశారు. అదేంఖర్మమో, నేనేదన్నా చమత్కారంగా గాని తెలివిగా గాని మాట్లాడబోయినప్పుడల్లా నాగొంతు నాకే తెలీకుండా బాకాలాగ తయారయి ఊరుకుంటుంది.

'కళల్ని ఉద్ధరిస్తారటగా?' అన్నాడా పెద్దమనిషి.

'కళల్ని ఒకరు ఉద్ధరించటమేమిటి? అవే వీళ్ళని ఉద్ధరిస్తాయి' అన్నాను.

'బాగా చెప్పారు' అన్నాడు...

మీటింగు ఆరంభమయింది. సోమేశ్వరుడుగారు మాట్లాడాడు.

'మనగ్రామం ఆట్టే పెద్దదికాదు. కాని ఇదివరలో అనేక రాజకీయోద్యమాలు ఈగ్రామానికి చైతన్యం కలిగించాయి. స్వాతంత్ర్యంతోబాటు ఈగ్రామానికి కొత్తజీవం రాకపోగా ఉన్నదికూడా పోయింది. అందుచేత కళాసేవా సంఘం ఏర్పాటుచేయ సంకల్పించాం. మన ఊళ్ళోనే ముగ్గురునలుగురు రచయితలున్నారు. ఒకచిన్న నాటకసమాజంఉంది. ఈకళాసేవా సంఘం మన కళాకారులద్వారా కళలకూ ప్రజలకూ మధ్యసంబంధం అభివృద్ధి అయేటట్టు చూస్తుంది. ఒకరచయితల ఉపసంఘము నటుల ఉపసంఘము ఏర్పాటుచేద్దాం. ఈ ఉపసంఘాలు గ్రామంలో సభలుజరిపిసాహిత్యంమీదా నాటకాలమీదా చర్చలుసాగిస్తాయి. పైనుంచిగొప్ప రచయితలనూ, నటులనూ రప్పించి ఉపన్యాసాలిప్పిస్తాయి, కావ్యపఠనమూ, నాటకప్రదర్శనలూ చేయిస్తాయి'—

'దీనికయ్యేఖర్చు ఎవరిచ్చుకుంటారండీ?' అని నేను నిలబడి అడిగాను.

'సంఘమే ఇచ్చుకుంటుంది.'

'సంఘానికి డబ్బెట్లావస్తుంది?'

'సభ్యత్వరుసుము నెలకు 4 అణాలు ఉంచాం. నూరుమందిసభ్యులు చేరినట్టయితే నెలకు పాతిక రూపాయల రాబడి సంఘానికి ఉంటుంది. దీనితో పని గడిచిపోతుంది.

'సభ్యులుగా చేరేవాళ్ళంతా రచయితలూ నటులూ అయి ఉండాలా?'

'అవసరం లేదు. ఎవరైనా సభ్యులుగా ఉండవచ్చు. ఇది అందరికీ సంబంధించినది'.

'ఉపసంఘాలు ఎట్లా ఏర్పాటుచేస్తారు? ఎన్నికలు జరిపా?'

'సభ్యులైన వారిలో కళలు సృష్టిచేసే వారందరూ ఉపసంఘాలలో ఉంటారు. దానికి ఎన్నికలెందుకూ?'

'అట్లా చెప్పండి. ఇదంతా గూడుపుఠాణీ అన్నమాట'.

సోమయ్యగారు నాకేసి కోపంగా చూసి, 'దయచేసి మీరామాట ఉపసంహరించుకుంటే బాగుంటుంది' అన్నాడు.

'నేనెందుకు ఉపసంహరించుకోవాలీ? మీరు ఉపసంఘాలకు న్యాయంగా ఎన్నికలు ఎందుకు పెట్టరు?'

'ఊళ్లోఉన్న కళాకారుల నందర్నీ ఉపసంఘంలో ఉంచుతున్నప్పుడింకా ఎన్నికలు దేనికా?'

'ఎవరు కళాకారులో మీకు తెలుసా ? నేను రచయితను కానని మీరు చెప్పగలరా?'

'మీరేమైనా రాస్తే మీరూ రచయితే'.

'రాయటానికేం అందరూ రాస్తారు. ఇక్కడున్న వాళ్ళంతా రాయగలవాళ్ళే. వేషంఇస్తే అందరూ నటిస్తారు. అందుకని అందర్నీ ఉపసంఘంలో చేరుస్తారా?'

'ఎవరు రచయితో ఎవరు నటుడో ఎట్లా తేలుతుందని మీ అభిప్రాయం?'

'అది ఎన్నికలవల్లనే తేలాలి. నేనూ రచయితనే, నటుణ్ణే, కాని పత్రికలు నా వ్యాసాలు తిప్పిస్తేనూ, నాటకసమాజంవాళ్ళు నాకు వేషం ఇవ్వకపోతేనూ అది నాతప్పు కాదు. నేను నిజంగా రచయితను అయిందీ కానిదీ ప్రజలే నిర్ణయిస్తారు'.

'వాళ్లకు మాత్రం సాక్ష్యం ఏదీ?'

'ప్రజాస్వామికంలో ప్రజలకు సాక్ష్యం అక్కర్లేదు. వాళ్ళ నిర్ణయాన్ని విమర్శించటానికి లేదు. అటువంటి ప్రజాస్వామికం మీరు సమ్మతంకాకపోతే ఇది గూడుపుఠాణీ అని ఒప్పుకోండి'.

సభలో కొంత కలకలం బయలు దేరింది. కొందరు నాకు ప్రతిపక్షం అయినారు. వాళ్ళంతా ఒకముఠా. నిజమైన పెద్దమనుషులంతా నాపక్షమే ఉన్నారు. అందరూ ఒక్కసారిగా మాట్లాడసాగారు.

'అయ్యా, ఆ పెద్దమనిషిని వేదిక ఎక్కి మాట్లాడ మనండి' అని కొందరు అరిచారు. వేదిక ఎక్కగానే నాకాళ్లు చల్లబడతాయని వాళ్ళ ఆశ.

నేనీవిధంగా మాట్లాడాను:

సోమేశ్వరుడుగారు చెప్పింది మనమంతా విన్నాం. మనఊళ్ళో కొందరు రాతగాళ్ళున్న మాటా నిజమే, నాటకసమాజం ఉన్నమాటా నిజమే. వీరంతా ఇదివరకే కొంత కీర్తిప్రతిష్టలు బావుకుంటున్నమాటా నిజమే. వీళ్ళకున్న యీ కీర్తిప్రతిష్ఠలుచాలక ఈసమాజం పెడుతున్నారు. దీనికిగాను మనమంతా చందాలువేసుకుని డబ్బు పోగుచేస్తే ఆడబ్బుతో వారు తమ ఇష్టంవచ్చిన వారిని పిలిపించి ఉపన్యాసా లిప్పించి, నాటకా

లాడించి తమఖ్యాతి మనమీద రుద్దుదామని చూస్తున్నారు. ఈసంఘం ఒక కొత్త రచయితను గాని, నటుణ్ణిగాని సృష్టిస్తుందా, సృష్టించదు. కళను ఉద్ధరించే ఉపసంఘాలను ఎన్నుకునే అధికారం మనకుంటుందా, ఉండదు. అదీ పరిస్థితి. ఇది గూడుపుఠాణీ అవునో కాదో మీరే నిర్ణయించండి. ఈవూళ్లో ఉన్న మనరచయితలూ, నాటకసమాజంవారూ సోమేశ్వరుడుగారి అభిమానానికి పాత్రులైనవాళ్ళు. అన్నిటికన్నా దగా ఏమిటంటే ఈ సంఘంద్వారా ప్రజల కేదో వొరుగుతుందిట. వొట్టిది! ఈ విషయం మననిజంగా నమ్మించాలంటే సోమేశ్వరుడుగారు ప్రజాస్వామిక విధానాలు గుర్తించవలసి ఉంటుంది'.

కొందరు చప్పట్లు కొట్టారు. ఈలలు వేశారు.

ఇంకో కాయన నన్ను తరుముకుంటూ వేదికమీదికి వచ్చి, 'ఇప్పుడు మాట్లాడిన పెద్దమనిషి—ఆయనను మనమంతా చాలా ఏళ్ళ నుంచీ ఎరుగుదుం—ఎవరు రచయితలు ఎవరు నటులు ప్రజాస్వామికవిధానాలనుబట్టి తేలుస్తాడుట. మనవూళ్లో బాగారాసే వాళ్ళెవరో చదివే వాళ్ళకు తెలుసు. ఎవరు బాగానటిస్తారో నాటకాలుచూసేవాళ్లకు తెలుసు. నేను కాదనను. కాని ఈయనకు కావలిసిన ప్రజాస్వామికం అది కాదు. అధికారం చలాయించదలచిన వాడల్లా తనమాటవినేవాళ్ళందర్నీ సభ్యులుగా చేర్చి తాను గొప్పరచయితననో, నటుడనో వారివోటుద్వారా రుజువు చెయ్యటం. ఇవి రాజకీయాలు. ఇందులో కళాప్రసక్తి ఏమీ లేదు. నాకుముందు మాట్లాడిన పెద్దమనిషి గడ్డిపచ్చగా కనిపించినా ఓర్వలేనిరకం. మన రచయితలను గురించీ, నటులను గురించీ ఈయనచేసే దుష్ప్రచారం అందరూ ఎరిగినదే' అన్నాడు.

'మీరు సోమేశ్వరుడుగారి ఏజెంటన్నది కూడా అందరూ ఎరిగినదే. మనబతుకుల బండారం అందరూ ఎరుగుదురు'.

ఆతరువాత ఇక తిట్లలోకీ తన్నులలోకీకూడా దిగిందిసభ. అల్లకల్లోలంతో సభముగిసింది....

మర్నాడెవరో నన్నడిగారు, నిన్న ఏదో గలభా అయిందిటనే, అని.

'ఈ కళాసేవ జరిగేది కాదని నే నేనాడో చెప్పాగా?' అన్నాను.

---

నర్సరావుపేట డిస్ట్రిక్టు మునసబ్ కోర్టులో O. S. 71/49

వాది : కాకుమాను వెంకటనరశింహ్వాం

ప్రతివాద్లు : 1. వంకాయల ఆదెయ్య 2. యీ. మల్లయ్య 3. యీ. రామకోటి అను వారలకు సాకీం వినుకొండతాలూకా పిచ్చికలపాలెం యీ నెంబరులో వాది 1 నుండి 3 వరకు ప్రతివాదులపైన నోటునుబట్టి దావాను దాఖలుచేయగా ప్రతివాదులకు నోటీసు నిమిత్తం 7-12-49 తేదీకి వాయిదా వేసినారు. గనుక సదరు వాయిదా రోజున పై కోర్టువారియెదుట పగలు 10 గంటలకు హాజరు అయి మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనిచో మీపరోక్షమందు తీర్మానించబడునని తెలుసుకోనేది.

శ్రీ ముత్తనపల్లి వెంకటేశ్వర్లు పంతులుగారు
వాదివకీలు

వాయిదా 7—12—49